## క్లుప్తంగా

### వేణుగోపాలునికి వివిధ వస్తువుల సమర్పణ



వంట పాత్రలు అందిస్తున్న దాతలు

కార్వేటినగరం : శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయానికి తిరుపతికి చెందిన భక్తులు బి.రఘూన్స్, మురళీ దంపతులు ప్రసాదాలు తయారు చేసే వంట పాత్రలను విరాళంగా అందించారు. అలాగే స్థానిక బొందు వీధికి చెందిన దేవారెడ్డి కుటుంబ సభ్యులు డోలు, నాదస్వరం వితరణ చేశారు. తిరుపతికి చెందిన చెంచుగార్ల కృష్ణ మూర్తి తన తాత /జ్ఞాపకార్థం సన్నాయి అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

### తమిళంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తమిళ భాషలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఎస్సీ విద్యార్థులు ప్రియ, లోకనాథం, భువనేశ్వరికి చెన్నై ఎస్.సుబ్బురెడ్డియార్ ట్రస్టు నిర్వాహకులు పతకాలు ప్రదానం చేశారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బంగారు, రజత, కాంస్య పతకాలు అందజేసి విద్యార్థులను అభినందించారు. గతంలో కళాశాలకు విచ్చేసిన సమయంలో ట్రస్టు నిర్వాహకులు ఇచ్చిన హామీ మేరకు పతకాలతో సత్కరించారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్, తమిళ అధ్యాపకులు జ్యోతి, పరీక్షల విభాగం అధ్యాపకులు వేణుగోపాల్, రమేష్ తదితరులు అభినందించారు.

### పారదర్శకంగా ఉపాధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న శంకరప్ప

పాలసముద్రం : ఉపాధి హామీ కింద చేపట్టిన పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని డిజేబుల్ కో–ఆర్డినేటర్ శంకరప్ప, సీడీసీఎల్ఆర్ అనిల్ కుమార్ స్పష్టం చేశారు. మంళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి, ఏపీఓ మార్గరేట్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శంకరప్ప మాట్లాడుతూ దివ్యాంగులకు సైతం ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు కార్యాలయానికే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కూలీలతో పనులు చేయించాలని సూచించారు. ప్రతి పంచాయతీలో కనీసం 300 మంది కూలీలకు పని కల్పించాలని కోరారు. సమావేశంలో జేఈ అనూషా పాల్గొన్నారు.

### దోమల నివారణే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం : పల్లెల్లో దోమలు వ్యాప్తి చెందకుండా నివారించడమే లక్ష్యంగా పనిచేయాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆదేశించారు. మంగళవారం పాలసముద్రం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ నీరు నిల్వ చేరిన ప్రాంతాల్లో డీడీటీ ద్రావణం పిచికారీ చేయాలన్నారు. కాచి వడగట్టిన నీరు, వేడిగా ఉండే ఆహారం తీసుకునేలా గ్రామీణులకు అవగాహన కల్పించాలని కోరారు. ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడే వారికి మందులు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

### మన సంస్కృతిలో యోగా ఒక భాగం



యోగా చేస్తున్న విద్యార్థులు

పుత్తూరు: భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగమని తిరుపతి యోగా వెల్‌నెస్ సెంటర్‌కు చెందిన శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అనంతరం యోగా మాస్టర్ హైమావతి పర్యవేక్షణలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం.. దైన్యం

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక మండలంలోని రైతన్నలు కుదేలవుతున్నారు. దళారులు సిండికేట్ అయి రైతన్నల కష్టార్జితాన్ని దోచుకుంటున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఇప్పటివరకూ కనీస మద్దతు ధర ప్రకటించకపోవడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం రైతన్నలకు శాపంగా మారింది. ఇదే అదునుగా దళారులు తాము చెప్పిందే రేటని రైతన్నలను దోచుకుంటున్నాయి.

కేవీశ్రీరామపురంలో వరిని శుద్ధి చేస్తున్న మహిళా రైతు



- దళారులు చెప్పిందే రేటు
- గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న రైతులు
- ఇప్పటివరకు మద్దతు ధర ప్రకటించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయని వైనం
- లబోదిబోమంటున్న రైతన్నలు

విజయపురం: మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో సుమారు 325 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇప్పటికే సూరికాపురం, గంగమాంబపురం, ఆలపాకం, బూచివానత్తం, పన్నూరు తదితర గ్రామాల్లో వరి నూర్పిడి చేశారు. మిగిలిన గ్రామాల్లో వరి కోతకు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే ధాన్యానికి గిట్టుబాటు ధర



సూరికాపురంలో దళారులు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు

లేకపోవడం అవకాశంగా తీసుకుని మరోవైపు దళారులు సైతం రైతన్నల కష్టాన్ని దోచుకునేందుకు రెడీ అయ్యారు. ఇక ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని తిలోదకాలు ఇచ్చిందనే చెప్పాలి. రైతన్నలను ఆదుకునే దిశగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్న చిత్తశుద్ధి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదని రైతులు మండిపడుతున్నారు.

**దళారులదే పైచేయి**

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం కొనుగోళ్లను సహకార పరపతి సంఘాలతో పాటు వ్యవసాయ మార్కెట్లకు అప్పజెప్పింది. తర్వాత రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత అధిక శాతం వాటి నుంచే కొనుగోళ్లు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు ధాన్యానికి మద్దతు(ఎంఎస్‌పీ) ధర ప్రకటించకపోవడం, ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చెప్పిన రేటుకే ధాన్యం అమ్ముకొని నష్టపోతున్నారు. ఏటా పెట్టుబడి, కూలీలు, ఎరువుల ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప ధాన్యానికి మాత్రం గిట్టుబాటు ధర మాత్రం పెరగడం లేదని ఆవేదన చెందుతున్నారు. పదేళ్ల కిందట ఎకరా పొలంలో వరి సాగుకయ్యే ఖర్చు రూ.10 వేలు కాగా ఇప్పుడు రూ.35 వేలకు చేరుకుంది. అయితే 75 కిలోల ధాన్యం బస్తాకు దళారులు చెల్లిస్తున్న ధర రూ.1500 లోపే, గ్రేడ్–1 పరిధిలోకి వచ్చే వరి రకాలకు రూ.1650, సాధారణ రకాలకు రూ.1500 చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకోవడంతో దళారీలు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధరను గత్యంతరం లేక వారికే అమ్ముకోవాల్సి వస్తోంది.

**త్వరలోనే ఏర్పాటు చేస్తాం**

ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. వచ్చిన వెంటనే రైతులు తెలియజేస్తాం. రైతులు వరిని భద్రపరుచుకుంటే ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే అమ్ముకోవచ్చు.

రజినికుమారి, ఏఓ, విజయపురం

### మాతా శిశు రక్షణే లక్ష్యం

గంగాధర నెల్లూరు : మాతా శిశు రక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని వైద్యాధికారులు దుర్గాదేవి, ప్రవీణ్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు చేయించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది శైల, ధర్మేంద్ర పాల్గొన్నారు.

### బంగారమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కార్వేటినగరం : బంగారమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

నగరి: అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినమాట నిలబెట్టుకోవాలి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌గౌరవాధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి అనుబంధం) యూనియన్ సర్వ సభ్య సమావేశం యూనియన్ నాయకులు శాంతి, మునెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోదండయ్య మాట్లాడారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు జీతాలు పెంచాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనాకూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అధికారానికి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా హామీ నెరవేర్చకపోవడం తగదన్నారు. సమస్యలపై స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరలా అంగన్‌వాడీలు మరో పోరాటానికి శ్రీకారం చుడుతారని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

**నూతన కమిటీ ఎంపిక**

నగరి శాఖ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బుజ్జి, కార్యదర్శిగా మునెమ్మ, కోశాధికారిగా శాంతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కస్తూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ, ఉపాధ్యక్షులుగా రమణమ్మ, సహకార్యదర్శిగా నీరజ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వేలన్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఐటీయూసీ సభ్యులు పాల్గొన్నారు.

### మొగిలి ఘాట్‌లో వరుస ప్రమాదాలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ దొరచెరువు వద్ద మంగళవారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుంది. కంటైనర్ వాహనం బ్రేక్ ఫెయిల్ కావడంతో ముందు వెళ్తున్న మరో కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ గాయపడ్డాడు. పలమనేరు నుంచి చిత్తూరు పోతున్న కంటైనర్ వాహనం మార్గమధ్యంలో మొగిలి ఘాట్‌లో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ముందు వెళ్తున్న మరో కంటైనర్ వాహనాన్ని ఢీకొట్టి రహదారి పక్కకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ సోహిత్‌ఖాన్ గాయపడ్డాడు. అతడిని 108లో బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఇదే ప్రాంతంలో మూడు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు గాయపడటం విదితమే.

## కన్నుపడితే.. కొండ కనుమరుగు

విజయపురం మండలం పరిసరాల్లో కొండలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కొండల్లో నాణ్యమైన గ్రావెల్ దొరుకుతుంది. సమీపంలోని తమిళనాడులో ఈ గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. దీంతో రాష్ట్రస్థాయి నుంచి మండలం వరకు ప్రతి నాయకుడి కన్ను ఈ దందాపైనే పడుతోంది. అధికార బలం ఉంటే చాలు క్వారీలకు నామమాత్రపు అనుమతి తీసుకొచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అనుమతుల మాటున అక్రమ క్వారీల తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. దీంతో పచ్చదనంతో ఉన్న కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. వీటిని నిలువరించడానికి స్థానిక నాయకులు ఎంతో పోరాటం చేస్తున్నా అక్రమ తవ్వకాలను అడ్డుకోలేకపోతున్నారు.

– విజయపురం

- జగన్నాథపురం కొండపై వ్యాపారుల కన్ను
- ఇప్పటికే హిటాచీతో దారి ఏర్పాటు చర్యలు
- తవ్వకాలు జరిగితే అడ్డుకుంటామంటున్న స్థానికులు




విజయపురం మండలం తమిళనాడు సరిహద్దులో ఉంది. అందుకే ఇక్కడ క్వారీ వ్యాపారం కోట్లలో సాగుతోంది. ఒక్కసారి పర్మిట్ తీసుకుంటే కోట్లకు పడగలెత్తవచ్చు. అనుమతి ఇచ్చిన ప్రభుత్వానికి వేలల్లో ఆదాయం వస్తే వ్యాపారికి కోట్లలో ఆదాయం వస్తుంది. దీంతో క్వారీ అనుమతి కోసం కింద స్థాయి నుంచి పైస్థాయి వరకు ఎన్ని లక్షలు ఇవ్వడానికైనా వ్యాపారులు వెనుకాడడం లేదు.

**తమిళనాడులో నిషేధం**

తమిళనాడులో గ్రావెల్ తవ్వకాలపై పూర్తిగా నిషేధం ఉంది. పెద్ద పెద్ద నాయకుల సైతం తమిళనాడులో గ్రావెల్ తవ్వడానికి భయపడేవారంటే ఎక్కడ చట్టం ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవాలి. దీంతో తమిళనాడులో ఇళ్లు, ఫ్యాక్టరీలు, రోడ్ల నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ దొరకడం కష్టంగా మారింది. దీంతో తమిళనాడుకు చెందిన కొందరు అక్రమ వ్యాపారుల కన్ను ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన విజయపురం మండలంపై పడింది. ఈ ప్రాంతానికి చెందిన కొందరు రాజకీయ నాయకులతో చేతులు కలిపి గ్రావెల్ తవ్వకాలు కొనసాగించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

**జగన్నాథపురం కొండపై దృష్టి**

రెండు వారాలుగా కొందరు క్వారీ వ్యాపారులు జగన్నాథపురం కొండను పరిశీలిస్తున్నారని, క్వారీ తరలించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికే భారీ యంత్రాలు అక్కడకు చేర్చి, అధికారులకు తెలియకుండా చదును చేస్తున్నట్లు తెలిసింది. అయితే జగన్నాథపురం కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తే, ఎంత పెద్ద నాయకుడైనా తాము అడ్డుకొంటామని స్థానికులు హెచ్చరించారు. ఇప్పటికే చెన్నై–బెంగళూరు హైవే పనుల కోసం అంటూ, పచ్చగా ఉన్న కొండను సైతం తవ్వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు క్వారీ తవ్వకాలకు అనుమతి ఇవ్వకుండా చూడాలని కోరారు.

## వైభవంగా రథసప్తమి కల్యాణోత్సవం





పట్టు పీతాంబరాలతో అలంకృతులైన శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామి, కల్యాణోత్సవానికి హాజరైన దంపతులు

నగరి: పట్టణంలో టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్యస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, తోమాల సేవ, తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా తిరుమంజనం సేవ, సాయంత్రం కళ్యాణోత్సవం భక్త జన సందడి నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ అధికారులు స్వామివార్లకు పట్టు పీతాంబరాలు సమర్పించారు. కళ్యాణోత్సవం సందర్భంగా అర్చకులు నిర్వహించిన ఆనంద నృత్యాలు, పూబంతుల ఆటలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్థానిక భక్తులు సతీసమేతంగా పూజల్లో పాల్గొన్నారు. పట్టు పీతాంబరాలు ధరించి ఉభయదేవేరులతో దర్శనమిచ్చిన కరియమాణిక్యస్వామిని దర్శించుకున్నారు. ఉభయదారులకు ఆలయ అధికారులు అక్షింతలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ, ఏఈఓ రవి, ఆలయ అధికారి వెంకటరమణ, గుణశేఖర్, వేద పండితులు రామ్‌ప్రసాద్, ధన్వంతరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**కరి వరదరాజ ఆలయంలో..**

సత్రవాడలోని కరివరదరాజ స్వామి ఆలయంలోను కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారిని సుందరంగా అలంకరించి సూర్య ప్రభ వాహనంలో ఆలయ ప్రదక్షిణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని కర్పూర హారతులు, కుంకుమ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న గుణశేఖర్‌నాయుడు, కుటుంబసభ్యులు

**వేణుగోపాలస్వామి ఆలయంలో..**

కార్వేటినగరం : రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన, అభిషేకం చేపట్టారు. అనంతరం దేవదేవేరులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి కనులపండువగా ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలోనే రాత్రి వేద మంత్రాల నడుమ వైభవంగా ఏకాంత సేవ జరిపించారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, వేదపారాయణుడు శివరామ శర్మ, అర్చకులు గోపాలాచారి, రమేష్, శబరీష్ పాల్గొన్నారు. అలాగే మధ్యాహ్నం ఆలయంలో శ్రీరంగరాజపురం మండలానికి చెందిన గుణశేఖర్ నాయుడు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మోహనమ్మ, గిరిబాబు కుటుంబీకులు పాల్గొన్నారు.



ఊరేగుతున్న దేవదేవేరులు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

**వేపంజేరిలో..**

గంగాధరనెల్లూరు : మండలంలోని వేపంజేరి గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు సూర్యప్రభ వాహనం, శేష వాహనం, అశ్వవాహనం, హంస వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మురళీకృష్ణ ,ఉపాధ్యాయులు కలిసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేశులురెడ్డి, అర్చకుడు విష్ణు స్వామి పాల్గొన్నారు.

### ఆరోగ్య సంరక్షణలో ఆశాలే కీలకం

ఐరాల: గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆశా వర్కర్లే కీలకమని జిల్లా కుష్ఠు, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. కుష్ఠు, టీబీ కేసులకు సంబంధించిన రికార్డులను, ల్యాబ్ రికార్డులను, గళ్ల పరీక్షల రికార్డులను పరిశీలించారు. ఆశాడే సందర్భంగా ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో కుష్ఠు, టీబీ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ మందిర్‌లో పలు రికార్డులను పరిశీలించి, వైద్య పరికరాలను ఎలా ఉపయోగించాలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత, డీపీఎంఓలు మణి, జాన్, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎల్‌డీసీ ఉమాపతి, ల్యాబ్ టెక్నీషియన్ అజార్, ఫార్మసిస్ట్ జయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**ఆది దేవా నమస్తుభ్యం.!**

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మనం కంటితో చూడగలిగేది సూర్యుడిని మాత్రమే. అందుకే సూర్యుడిని ప్రత్యక్ష దైవమని పిలుస్తారు. రథసప్తమి రోజు ప్రత్యేకంగా సూర్యుడికి పూజ చేస్తారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ సప్తమిని రథసప్తమిగా నిర్వహించడం పరిపాటి. ఈ రథసప్తమి వేడుకలను మంగళవారం చిత్తూరు నగరంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈశ్వర గుడివీధిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం అభిషేక పూజలు చేశారు. తోమాల సేవ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గరుడ సేవలో ఊరేగించారు. కట్టమంచిలోని వరదరాజులస్వామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పలు సేవల్లో ఊరేగారు.




కంకర తేలి మట్టి రోడ్డును తలపిస్తున్న సిమెంట్ రోడ్డు

విజయపురం: మండలంలోని కేవీ శ్రీరామపురం గ్రామీణ రోడ్డు అధ్వానంగా ఉంది. ఇటీవల కేవీ శ్రీరామపురం కుశస్థలినది నుంచి వందల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు తిరుగుతుండడంతో సిమెంట్ రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది మారింది. అధికారులు రోడ్డు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## సమయపాలన పాటించని సిబ్బంది

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం ఏఎం పురం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శితో పాటు సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. మొత్తం 9 మంది సిబ్బంది పని చేస్తున్నారు. అయితే మంగళవారం ఉదయం 11.10గంటలకు కూడా సిబ్బంది లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. డిజిటల్ అసిస్టెంట్ మినహా మిగిలిన వారు ఎవ్వరూ రాలేదు. గ్రామ సమస్యలను నివేదించడానికి వెళ్లిన ప్రతిసారీ ఇలాంటి పరిస్థితే ఎదురవుతోందని, మండల, జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే ఈ పరిస్థితి కలుగుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా సచివాలయ సిబ్బందిని దారిలో పెట్టాలని కోరుతున్నారు.



ఏఎం పురం సచివాలయంలో సిబ్బంది రాక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు